క్లుప్తంగా

వార్డు సచివాలయాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని 10,11వ వార్డు సచివాలయాలను శనివారం మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన సచివాలయాల్లోని ఉద్యోగుల, వార్డు వలంటీర్ల రికార్డులు పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో బిల్లు కలెక్టర్ చంద్ర, సచివాలయాల క్లర్క్ ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కదిరప్పస్వామికి ప్రత్యేక పూజలు


స్వామిని దర్శించుకుంటున్న మంజునాథ్‌రెడ్డి

గుంతకల్లు రూరల్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి శనివారం పెద్ద కదిరప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు మంజునాథరెడ్డి కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో లక్ష్మి నరసింహ స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, మాజీ ఎంపీటీసీ జయరామిరెడ్డి ఉన్నారు.

ఒకరికి గాయాలు

గుత్తి: కొత్తపేట బ్రిడ్జి సమీపంలో శనివారం బైక్ నుంచి కింద పడటంతో ఒకరికి గాయాలయ్యాయి. రాయలచెరువుకు చెందిన రామాంజనేయులు పని మీద గుత్తికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి బైక్‌లో స్వగ్రామానికి బయలుదేరారు. కొత్తపేట బ్రిడ్జి సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో గాయపడిన అతడిని స్థానికులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని మహర్షి దయానంద గురుకుల పాఠశాలలో శనివారం రెడ్ ఫ్లస్ సంస్థ, మహర్షి దయానంద గురుకుల పాఠశాల యాజమాన్యం సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించాయి. పాఠశాల అధినేత టీవీ చలపతి రాజు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి సరిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెడ్ ఫ్లస్ సంస్థ అధ్యక్షుడు షేక్షావలి, పాఠశాల కరస్పాండెంట్లు విద్యాధర్, వేదమూర్తి, హెచ్ఎం ఇమ్రాన్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాక్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గుంతకల్లు రూరల్: నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా న్యాక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు, జిల్లా అధికార ఆనంద్ రాజ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని న్యాక్ సెంటర్‌లో అసిస్టెంట్ ఎలక్ట్రికల్, అసిస్టెంట్ సర్వేయర్, ప్లంబింగ్, శానిటేషన్ విభాగాల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. పదో తరగతి ఆపై చదివిన యువతీ యువకులు ఈనెల 30 లోపు న్యాక్ సెంటర్‌లో పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. వివరాలకు 7019425587, 7013858450 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధే లక్ష్యం

గుంతకల్లు రూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధే తమ లక్ష్యమని రాయలసీమ ఎస్టీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా సేవా సంఘం అధ్యక్షుడు షేక్ ఆలం నవాజ్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు 85 శాతంపైగా ఉన్నారన్నారు. హక్కులను కాపాడుకునేందుకు అందరూ ఐక్యంగా పోరాడుదామన్నారు.

ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాలు


పూజలందుకుంటున్న వేంకటేశ్వరుడు

యల్లనూరు: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఏకాంతోత్సవంతో శ్రీవారు ఊరేగింపుగా వెళ్లారు. భక్తులు స్వామి సేవలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

గాలివానతో అపార నష్టం

శింగనమల: నియోజకవర్గంలోని శింగనమల, నార్పల, పుట్లూరు మండలాల్లో గాలివాన, వడగండ్ల వర్షంతో వరి, అరటి, మామిడి తోటలు నేలకొరిగాయి. రైతులు భారీగా నష్టపోయారు. శింగనమల చెరువు కింద శింగనమల, గోవిందరాయునిపేట, శివపురం, సీ.బండమీదపల్లి , పోతురాజుకాల్వ, చక్రాయిపేట గ్రామాల రైతులు దాదాపు 1500 ఎకరాల్లో సాగు చేసిన వరి పంట దెబ్బతింది. గోవిందరాయునిపేట వద్ద రైతు శంకర్‌రెడ్డి సాగు చేసిన మామిడి, చీనీ తోట నేలకొరిగాయి. శివపురం గ్రామంలో వడ్డె రామాంజి, పట్రా గోపాలు, మురళీ, మనోహర్, గుర్రమ్మ, ఎర్రమ్మ, లక్ష్మీదేవి రేకుల షెడ్లు గాలికి ఎగిరిపోయాయి. సీ.బండమీదపల్లిలో రోడ్డు వద్ద ఏర్పాటు చేసుకున్న బంకు గాలికి కొట్టుకుపోయింది. పెద్దజలాలపురం, పెరవలి, కొరివిపల్లి , సోదనపల్లి, మట్లగొంది గ్రామాల్లో అరటి పంటలు దెబ్బతిన్నాయి. వర్షాలకు దెబ్బతిన్న పంటలు గురించి తెలుసుకున్న ప్రభుత్వ విద్యసలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంటలు నష్టపోయిన రైతులందరినీ ఆదుకుంటామన్నారు. మదిరేపల్లిలో నారాయణస్వామి 6 ఎకరాల్లో బొప్పాయి నాటారు. గాలివాన, వడగండ్లకు బొప్పాయి పంట పూర్తిగా దెబ్బతిన్నదని రైతు వాపోతున్నారు. దాదాపు రూ.15 లక్షలు వరకు నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు. శింగనమల నుంచి పెరవలి సబ్‌స్టేషన్‌కు వెళ్లే విద్యుత్ స్తంభాలు దాదాపు 20 దాకా పడిపోయాయి. దీనివలన ఈసబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం వాటిల్లింది. ఆదివారం సాయంత్రంలోపు విద్యుత్ స్తంభాలు నాటి, విద్యుత్ సమస్య తీర్చుతామని ట్రాన్స్‌కో ఏఈ విజయకుమార్ తెలిపారు.

గుంతకల్లు రూరల్: కదిరిపల్లిలో శనివారం సాయంత్రం భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో గ్రామంలో 6 ఎకరాల్లో సాగు చేసిన అరటిపంట పూర్తిగా నేలమట్టం అయింది. పంట పెట్టుబడి కోసం రూ.8 లక్షలు ఖర్చు చేశానని, మరో 20 రోజుల్లో పంట కోయాల్సి ఉండగా గాలివానకు పంట మొత్తం నేలకొరిగిందని బాధిత రైతు దస్తగిరి వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు. అలాగే అయ్యవారిపల్లిలో దాదాపు 35 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలవాలింది.


గుంతకల్లు మండలం కదిరిపల్లిలో ఈదురు గాలులకు నేలమట్టమైన అరటితోట

నార్పల: మండల వ్యాప్తంగా శనివారం కురిసిన వడగండ్ల వర్షానికి పెద్ద ఎత్తున పండ్ల తోటలు దెబ్బతిన్నాయి. మద్దలపల్లి, వెంకటాంపల్లి, నాయనపల్లి తదితర గ్రామాల్లో అరటి పంట పూర్తిగా నెల కొరిగింది.చేతికొచ్చిన మామిడి , చీని పంట నేలపాలైంది. వరి, మొక్కజొన్నతో పాటు వివిధ పంటలు దెబ్బతిన్నాయి, గాలివాన బీభత్సానికి పెద్దపెద్ద వృక్షాలు,షెడ్లు నేలకొరిగాయి. పంటలు దెబ్బతినడంతో రూ.కోట్లు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు. దెబ్బతిన్న పంటలను వైఎస్సార్‌సీపీ నాయకులు రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రఘునాథ్ రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. పంట నష్టపోయిన వారందరికీ ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా శనివారం ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన పడింది. అకాల వర్షం వల్ల వరి పంట దెబ్బతిన్నట్లు రైతులు వాపోతున్నారు.

పామిడి: పామిడిలో శనివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ బలమైన ఈదురుగాలులు, ఉరుములతో వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలైన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం, వీకే ఆది నారాయణరెడ్డి కాలనీ, నాయీబ్రాహ్మణ కాలనీ, చైతన్యకాలనీ, వెంగమనాయుడు కాలనీ, సరస్వతీ విద్యామందిర మదీనా కాలనీ, మడికట్ల ఆంజనేయ స్వామివీధి, బెస్తవీధి జలమయమయ్యాయి. స్థానిక మదీనా కాలనీ గృహ విద్యుత్ కోసం ఏర్పాటు చేసుకున్న కట్టెలు నేల కొరిగాయి.

యల్లనూరు: మండల వ్యాప్తంగా శనివారం మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు మొదలై వడగండ్ల వాన పడింది. దీంతో ద్విచక్రవాహన దారులు ఇబ్బందులు పడ్డారు. చీనీ, అరటి, దానిమ్మ, పత్తి, వేరుశనగ, మొక్కజొన్న పంటలు ఎండుతున్న నేపథ్యంలో ఓ మోస్తరు వర్షం కురవడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బుక్కరాయసముద్రం: మండలంలో శనివారం గాలివానకు పంటలు నేలకొరిగాయి. మండలంలోని బాట్లో కొత్తపల్లి, రేగడి కొత్తూరు, గోవిందపల్లి, చెదుల్ల, నీలారెడ్డిపల్లి, చెన్నంపల్లి, దయ్యాలకుంటపల్లి గ్రామాలలో మొక్కజొన్న, అరటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మండలంలో 200 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. దాదాపు కోటి రుపాయలు వరకు పంటలు నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని మండల రైతులు కోరారు.


వెంకటాంపల్లిలో నేలరాలిన చీనీకాయలు

శింగనమల(పుట్లూరు): గాలి వాన, వడగండ్లకు పుట్లూరు మండలంలో మొక్కజొన్న, అరటి పంటలు బారీగా దెబ్బతిన్నాయి. మండలంలోని మడ్డిపల్లి, కడవకల్లు , మడుగుపల్లి, ఎల్లుట్ల, జంగంరెడ్డిపేట,కుమ్మనమల, బాలాపురం, పుట్లూరు, జంగంరెడ్డిపేట గ్రామాల్లో 800 ఎకరాలు నుంచి 1000 ఎకరాల వరకు పంట నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. దాదాపు రూ.30 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని రైతులంటున్నారు. పుట్లూరు మండలంలో అరటి పంటను ఎక్కువ మంది సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా రూ.కోట్లలో పంటకు ఆదాయం వచ్చేదని, కాని గాలివాన, వడగండ్లతో పంట పూర్తిగా దెబ్బతిన్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.3 లక్షలు వరకు ఆదాయం వచ్చేదని, కాని తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు.


సి.బండమీదపల్లిలో ఎగిరిపోయిన రేకులు


యల్లనూరులో రోడ్డుపై పడిన వడగండ్లు


బాట్లో కొత్తపల్లిలో దెబ్బతిన్న మొక్కజొన్న


మదిరేపల్లిలో నేలకొరిగిన బొప్పాయి తోట


పామిడిలో జలమయమైన బెస్తవీధి

అభివృద్ధి కనిపించలేదా అస్మిత్?

యాడికి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే గుడిపాడు పంచాయతీలో అభివృద్ధి జరిగిందని, అది నీకు కనిపించలేదా అస్మిత్ అంటూ గుడిపాడు సర్పంచు దండు సావిత్రి పేర్కొన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం గుడిపాడు, కుందనకోట పర్యటనకు వచ్చిన టీడీపీ ఇన్‌చార్జ్ అస్మిత్‌రెడ్డి గ్రామంలో తాగునీరు, డ్రైనేజీ సమస్య గతంలో లేదని, సీసీ రోడ్లు గతంలో ఏర్పర్చినవేనని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దా రెడ్డి గ్రామంలో దాదాపు రూ.75 లక్షలతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించారన్నారు. రూ.9 లక్షలతో సీసీ రోడ్లు, నాడు–నేడు కింద రూ.10 లక్షలతో ప్రాథమికోన్నత పాఠశాలను ఆధునీకరించారన్నారు. 7వ తరగతి పూర్తయి తర్వాత విద్యార్థుల చదువు ఆగిపోకూడదని ఈ సంవత్సరం ఆరంభంలోనే 8వ తరగతి విద్యార్థులకు గ్రామంలోనే చదువు ఏర్పాటు చేయించామన్నారు. గత ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి హయాంలోనే కుందనకోటలో ఉన్న ప్రాథమిక పాఠశాల మూత పడిందన్నారు. నాటి నుంచి 13 కిలో మీటర్ల దూరంలో ఉన్న యాడికిలో విద్యార్థులు ఆటోల ద్వారా వచ్చి విద్యనభ్యసిస్తున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కుందనకోటలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పర్యటించిన సందర్భంగా విద్యార్థుల ఇబ్బందులను తెలియజేశామన్నారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సాగర్ సిమెంట్ సహకారంతో విద్యార్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వంలో సాగర్ సిమెంట్ నుంచి 2 కి.మీ దూరంలోని గుడిపాడు వరకు తాగునీటి పైపులైను రోడ్డు కిరువైపులా నిరుపయోగంగా ఉండేదని, గతేడాది ఎమ్మెల్యే చొరవతో రూ.20 వెచ్చించి గుడిపాడు ఓహెచ్ఎస్ఆర్ వరకు పైపులైను పనులు, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి నీటి సమస్య పరిష్కరించామన్నారు. మరో రూ.15 లక్షలు గ్రామాభివృద్ధి పనులకు సిద్ధంగా ఉన్నాయన్నారు. గత 30 ఏళ్ల నుంచి చేయని అబివృద్ధి పనులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవతో జరుగుతున్నాయని, అయితే అబివృద్ధి జరగడం లేదని అస్మిత్‌రెడ్డి అనటం హాస్యాస్పదంగా ఉందని సర్పంచు తెలిపారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయండి

యాడికి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా రాయాలని వక్తలు పేర్కొన్నారు. శనివారం వేములపాడులోని కేజీబీవీలో శనివారం 10వ తరగతి విద్యార్థులు ఎస్ఓ నిర్మల ఆధ్వర్యంలో సరస్వతి పూజ నిర్వహించారు. సర్పంచు ఓంకారమ్మ మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే కేజీబీవీ, తల్లిదండ్రులకు మంచి పేరు వస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు సాంబశివుడు 39 మంది విద్యార్థినులకు రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు, పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్స్ అందిస్తున్న సర్పంచు ఓంకారమ్మ

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా పని చేయండి


పాతకొత్తచెరువు సబ్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ వీరబ్బాయి

గుంతకల్లు రూరల్: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా వైద్యారోగ్య సిబ్బంది పనిచేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వీరబ్బాయి సిబ్బందికి సూచించారు. శనివారం పట్టణంలోని అర్బన్‌హెల్త్ సెంటర్లతోపాటు, పాతకొత్తచెరువు, వెంకటాంపల్లి హెల్త్ సబ్ సెంటర్లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించి, సబ్ సెంటర్లను పని తీరుపై ఆరా తీసిన ఆయన అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. తల్లీబిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న వారి వివరాలను ఎప్పటికప్పుడు సేకరించి వారికి అవసరమైన వైద్యం అందించాలన్నారు. డెమో ఆఫీసర్ భారతి, డిప్యూటీ డెమో ఆఫీసర్ త్యాగరాజు ఆయన వెంటున్నారు.

ప్రకృతిని కాపాడుకుంటే రోజూ పండగే

గుంతకల్లు రూరల్: ప్రకృతిని జాగ్రత్తగా కాపాడుకోగలిగితే మన కు రోజూ పండగేనని రైల్వే ఎస్పీ కే.చౌడేశ్వరి పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో సమాజ సేవకులకు ఉగాది పురస్కారాల ప్రదానం చేశారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి రైల్వే ఎస్పీ హాజరై మాట్లాడారు. ప్రకృతిలో పంచభూతాలైన గాలి, నీరు, నిప్పు, ఆకాశం, భూమి వంటి వాటిని సక్రమంగా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. అనంతరం ఆమె పలువురికి ఉగాది సేవా పురస్కారాలను అందజేశారు.


ఉగాది సేవా పురస్కారం అందిస్తున్న రైల్వే ఎస్పీ చౌడేశ్వరి

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

గార్లదిన్నె: కల్లూరుకు చెందిన బాషా ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. శనివారం మృతుడి కుటుంబానికి అధికారులు, వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు అందజేశారు. మిగతా రూ.90 వేలు నామినీ బ్యాంకు ఖాతాలో జమవుతుందని వారు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బృందావన్ రామాంజనేయులు, మాబు, రెఫల్ ఖాజా, పంచాయతీ కార్యదర్శులు అశోక్, తేజ తదితరులు పాల్గొన్నారు.


మృతుడి కుటుంబానికి చెక్కు అందిస్తున్న అధికారులు, నాయకులు

అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా

తాడిపత్రి టౌన్ : మహిళా దినోత్సవాన్ని(2023) పురస్కరించుకుని పారిశుద్ధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనపరచిన మహిళలు ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డుల కోసం ఈనెల 22లోపు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బజ్బార్ మియా పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం స్వయం సహాయక సంఘాల సభ్యుల ప్రత్యేక సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రతిభ కనపరచి మహిళలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు ప్రదానం చేయాలని నిర్ణయించిందన్నారు. టాయిలెట్స్ నిర్వహణ, మురుగునీటిని శుద్ధీకరణ, తడి, పొడి చెత్త వేరు చేయడం, చెత్తతో కళాకృతులు, సేంద్రియ ఎరువుల తయారీ, స్వచ్ఛతపై అవగాహన కల్పించడం తదితర విభాగాల్లో అవార్డులు ఇస్తామన్నారు. ఎంపికైన మహిళలకు జూన్ 5 పర్యావరణ దినోత్సవంలో అవార్డులను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని కమిషనర్ తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, టీపీఎస్ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం

గుంతకల్లు రూరల్: చిరుధాన్యాల సాగుతో ఆదాయంతోపాటు ఆరోగ్యం సమకూరుతుందని ప్రశాంతి గ్రామైక్య సంఘం సభ్యులు మహిళా రైతులకు పేర్కొన్నారు. మిల్లెట్ మాసోత్సవాల్లో భాగంగా శనివారం నక్కనదొడ్డి గ్రామంలో ప్రశాంతి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగుపై మహిళా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు అనవాయితీగా వేరుశనగ పంటపైనే ఆధారపడటం, పంట మార్పిడి చేపట్టకపోవడం వంటి కారణాలతో తరచూ పంట నష్టం వాటిల్లుతోందన్నారు. ప్రజలకు ఆరోగ్యాన్ని పంచేలా కొర్రలు, రాగులు, సద్దలు, జొన్నలు, సామలు, అరికెలు, పెసలువంటి పంటలను సాగు చేయాలని కోరారు.

పెద్దవడుగూరు : చిరుధాన్యాల తినడం ద్వారా మనిషి ఆరోగ్యంగా ఉండొచ్చని ఎఫ్‌పీఓ ఏపీఎం శారద, సీసీ పుల్లయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక గ్రామ సంఘం కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులు, మహిళా రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జొన్న, కొర్ర, సజ్జలు, రాగి లాంటి ధాన్యాలతో వంటలు తయారు చేసుకొని తినడం వలన కలిగే లాభాలను వివరించారు. ప్రతి ఒక్కరూ ఆహారపు అలవాట్ల ను మార్చుకోవాలని కోరారు.


అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

బాల్య వివాహాలు అరికట్టాలి


మాట్లాడుతున్న సీడీసీ సభ్యురాలు

పెద్దవడుగూరు : గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను అరికట్టాలని ఏటీఎల్ నారాయణ పేర్కొన్నారు. శనివారం రావులుడికి ఎస్సీ కాలనీలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహళల అభ్యున్నతికి ఆర్డీటీ సంస్థ నిర్విరామంగా కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాలల్లో బాల్య వివాహాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహిళలను రక్షించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో సీఓ నాగమణి, సిబ్బంది, సీడీసీ మెంబర్లు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహావిష్కరణ


వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ వన్నూర్‌బీ తదితరులు

గుత్తి: చెట్నేపల్లి గ్రామంలో శనివారం వాల్మీకి విగ్రహావిష్కరణ జరిగింది. వాల్మీకి సంఘం, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్ బీ, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు చినబాబు, పామిడి వీరాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు వాల్మీకి మహర్షి చరిత్రను వివరించారు. వాల్మీకి సంఘం నాయకులు రమేష్, రామకృష్ణ, వాల్మీకి యువసేన జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల సూరి, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు గురుప్రసాద్‌యాదవ్, సుధాకర్, జిల్లా నాయకులు శివయ్య, బాచి, మండల యువసేన అధ్యక్షుడు నరేష్, పట్టణ సచివాలయ కన్వీనర్ రంగస్వామి, కౌన్సిలర్ నరేష్, షఫి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు


అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి

పామిడి: పట్టణంలోని చిన్న విఠోబ ఆలయంలో శనివారం రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రుక్మిణీ పాండురంగస్వామి దేవతామూర్తుల విగ్రహాలను శోభాయానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భజన బృందం విఠోబస్వామి భక్తి గీతాలు భక్తులను పరవశింపజేశాయి. అనంతరం రుక్మిణీ పాండురంగస్వామి ప్రతిమలను పల్లకీలో ఉంచి ప్రాకారోత్సవం గావించారు.

కర్ణాటక మద్యం పట్టివేత


పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న పోలీసులు

గుంతకల్లు రూరల్: పట్టణంలోని షికారి కాలనీకి చెందిన షికారి సుజాత అనే మహిళను శనివారం అరెస్ట్ చేసి అమె నుంచి 14 బాక్సుల కర్ణాటక మద్యం (1344 టెట్రా ప్యాకెట్లు) స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ మహేష్ కుమార్ తెలిపారు. అదే సమయంలో షికారి నాగు పరారయ్యాడన్నారు. సుజాతను రిమాండ్‌కు తరలించామన్నారు.

ఆప్కో వస్త్రాలపై ఉగాది, వేసవి ఆఫర్లు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆప్కోలో చేనేత వస్త్రాల క్లియరెన్స్ సేల్ పేరుతో బంపర్ ఆఫర్లు ప్రకటించినట్లు ఆప్కో డివిజనల్ మార్కెట్ ఆఫీసర్ భారతి ఓ ప్రకటనలో తెలిపారు. ఉగాది, వేసవి కాలం సందర్భంగా ఒకటి కొనుగోలు చేస్తే ఒకటి ఉచితం, ఒకటి కొంటే రెండు ఉచితం ఆఫర్లను ప్రకటించారు. నగరంలోని సైఫుల్లా బ్రిడ్జి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆప్కో దుకాణంలో క్లియరెన్స్ సేల్ ప్రారంభించినట్లు తెలిపారు.

విగ్రహం చోరీకి విఫల యత్నం


పడేసిన పురాతన వీరభద్రస్వామి విగ్రహం

యల్లనూరు: పుట్లూరు మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో పురాతన వీరభద్ర స్వామి విగ్రహం చోరీ చేసేందుకు గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ప్రయత్నించారు. కొందరు గ్రామస్తులు ఆ సమయంలో అటుగా రావడంతో అక్కడే పడేసి పారిపోయారు. విగ్రహంలో బంగారం ఉన్నట్లు గుర్తించి తీసుకెళ్లేందుకు యత్నించారని గ్రామస్తులు తెలిపారు. ఎస్ఐ వెంకటప్రసాద్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదు.